

# స్వప్న జీవితాలు

రచన: "రాజ్యశ్రీ"

నురగలు కక్కుతూ వస్తున్న సముద్ర తరంగాలు పారాణి కాళ్ళను తాకుతూ సంతోషంగా పరుగెత్తుతున్నయ్...పారాణి కాళ్ళమీద జీరాడుతున్న వెన్నెలలాంటి తెల్లటి చీర కుచ్చెళ్ళు పసుపువర్ణం ధరించాయ్... దూరంగా తూర్పుదెస చందమామ ఆహ్లాదంగా కన్పడుతున్నాడు...పున్నమి నాటి సముద్రుడు ఆనందంతో ఆడుతున్నాడు...సముద్ర గట్టుకి అక్కడికి షికారుకిరావటం ఎవరికి అలవాటు లేదు. ప్రశాంతంగా ఒంటరితనంతో వుంది. జాలిగుండె వాళ్లకి భయంగా వుంటుంది. విజయ ఎంత ధైర్యంగా వచ్చిందో మరి! ఆలోచనలతో కళ్ళు బరువెక్కి, తల స్వాధీనంతప్పి, తన శరీరం పట్టు విడిపోయింది...



జీవితంలో ఏవేవో తీరని కోరికలు ఊహించి ఆనందంగా జీవిద్దామనే ఆలోచించా. అన్ని విధాల బాధ పడ్డా. అయినా అనుకున్న సౌఖ్యాలన్నీ జారిపోయాయి...దీనిలో నా భాగం ఎంత ఉంది? ప్రశ్న పరంపరలేకాని సమాధానం ఎవరిస్తారు? ఆలోచనలతో అలసిపోయిన విజయకి చిన్నకునుకు పట్టింది. నల్లరాళ్ళే చక్కటి పరుపులాఉంది...

"విజయా ఇట్లారా" అన్నదో కంఠం.

తల తిప్పి ఇటూ ఆటూ చూసింది. ఎవరు?

"గుర్తుపట్టలేదా విజయా? అంటూ కనబడ్డాడు సూర్యం.

"నువ్వా సూర్యం! ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నావ్! నేను చనిపోయాననుకున్నావా" అంది ఉద్వేగంతో విజయ

"ఎట్లా కనపడేది విజయా! ఎన్నాళ్ళనుండో ఉండే బాంధవ్యం పూర్తిగ విచ్ఛిన్నమైంది. అప్పటినుంచి వెనుకది అంతా కల అనే భావిస్తూ, మళ్ళీ నీవు కనబడితే ఇద్దరు బాధ పడాలని దూరంగా తిరుగుతున్నా. నీ కోరిక తీరింది. డాక్టరు వయ్యావు...చక్కగా గృహిణి కాబోతున్నావు. నాకు చాల ఆనందం విజయా. నేను దూరంగా ఉన్నా నీ మంచే కోరుతూ, నీవు ఆనందంగాఉంటే సంతోషిస్తూ ఉంటా..."

"ఎంతగా చిక్కావు సూర్యం. ఎక్కడ ఉంటున్నావు. శ్రీమతితో కాపురం పెట్టావా? చిరునవ్వు నవ్వుతూ అంది...

విషాదపూరితమైన చిరునవ్వుతో బాగానే ఉన్నానే అన్నాడు.

"మరి శ్రీమతితో?"...అతని ఉంగరాల జుట్టు చిందర వందరగా నుదురుపై నాట్యం చేస్తోంది. ఎపుడూ ఏవో తియ్యని కోరికలతో మరో లోకానికి తీసికొనిపోయే ఆ కళ్లు విచారంగా ఉన్నాయి...

"ఏంమాట్లాడవు?" బాధగాఅడిగింది.

"ఈ దౌర్భాగ్య జీవితానికి శ్రీమతి కూడ ఎందుకు విజయా? మరి అదో కొత్త బాధ తెచ్చుకోలేను...నాకు తగ్గ చిన్న నౌఖరి సంపాదించా...దానితో క్రింద మీద పడుతూ జీవిస్తున్నా... ఉన్నది కూడ చాల దూరంలో దానికేం ఓ డాక్టరునే పెళ్లాడుతున్నావటగా" కన్నులు నీళ్లతో తొణికిసలాడాయి.

"ఆ...డాక్టరుకే గృహిణి అవుతున్నా నా కోరిక మన్నించవూ సూర్యం" ప్రార్థిస్తూ అడిగింద.

"మన్నించటమా...నెత్తిన పెట్టుకుంటూ చెప్పవూ!...

"మాట తప్పవుగా!"...

"నమ్మకం లేదా విజయా?" మళ్ళీ నూతనంగా జన్మించాం అనుకో... యౌవనంలో ఉన్నావు. సంపాదన ఉంది...గుణం ఉంది. చక్కటి పిల్లని పెళ్ళిచేసికొని నా హృదయ బాధ తీర్చవూ?

'అది అసంభవం విజయా' ఈ జీవితంలో జరిగిన కథ చాలు. మరో దెబ్బ అఖ్ఖర్లేదు...మొదటినుంచి బుద్ధిమంతుడనిపించుకొని పూర్వ జన్మ సుకృతం వల్ల నీమీద గౌరవంతో సంచరిస్తూ నీ నోటిమీదగావిని ఆనందంతో కేరింతలు కొట్టి నువ్వు నా దానివే అనుకొని సంతోషించా...అది దేనివల్లో తారుమారయింది...దానికి నీమీద కోపం లేదు. ఇంకా గౌరవం, అభిమానం ఎక్కువైంది. పోని నీ జీవితమైనా ఆనందంగా గడుస్తే చాలు. నాన్నగారు, వారు క్షేమంగా ఉన్నారా?...

విజయలేచి సూర్యం కాళ్ళు పట్టుకొని అతని పాదాలన్ని కన్నీటితో ముంచెత్తి ... సూర్యం నీమనస్సెంత మంచిది...నీ హృదయంలో రగులుతున్న ఆరని మంటను చూశా. అయినా ప్రశాంతంగా ఉన్నావు...నా కోరిక తీర్చకపోతే నేను ఇక్కడే మీ ముందు తలబ్రద్దలు కొట్టుకుంటా. మరో మార్గం లేదు...నా కోరిక తీర్చి మన్నించరూ!

"నేను మిమ్మల్ని పెట్టిన బాధకు ఎంతో అనుభవిస్తా...మీరు ఆనందంగా మీ శ్రీమతితోవచ్చి నాకు కనపడరూ! ఏడుస్తూనే అంది...

"నీపట్టు విడవ్వా! నాకు ఈవిధంగా ఉంటేనే హాయిగా ఉంది విజయా!"

"అంతేనా సూర్యం! మీ ముందు తలబ్రద్దలు చేసుకొని చావమన్నారా?"

అదేం మాట విజయా! ఛా తప్పు కదూ...అట్లాగే చేసుకుంటాలే.

"అబ్బ! ఎంతమంచిహృదయమండి మీది...ఇంతలో మరో పెద్ద కెరటం వచ్చి అతన్ని తనలో ఇముడ్చుకొని వెనుకకు మళ్లింది.

కెవ్వుమని కేక వేసింది విజయ...

ఆ నిర్జన ప్రదేశంలో ఎవరున్నారు వినటానికి.

ఘోషతో పరిగెడుతూన్న సముద్రుడు కఠిన శిలలు ఆక్రందనాన్ని విన్నా చెక్కు చెదరకుండా ఉన్నయ్. విజయ హృదయం కూడా శిలాకృతి పొందింది. అతిగా విచారించినా కూడా హృదయాలలో గొప్ప అలజడికల్గి తర్లి పాషాణం అవుతుంది. విజయ భగ్న హృదయానికి మళ్ళీ సూర్యం కనపడటం, ఈవిధంగా తనెదుటే హరించుకుపోవటంవల్ల ఆమె హృదయం ఘనీభవించింది.

"జీవితంలో ఆనందం అంటే ఏమిటి అనేది చవిచూడవలసిన యౌవనం-నాగరికత, విద్య, అందం అన్నీ ఒక చోటే ఏరికూర్చిన తనవంటి యువతి జీవితం ఈ విధంగా తయారవుతుందనే తెలియదు. సూర్యం తనకి మొదట తటస్థపడింది ఈ ప్రదేశంలో నే-అ రోజుల్లో అతని సౌమ్యత, రూపు అన్నీ చూస్తే ఈ రోజు తను చూసిన దానికి పోలికలేదు-సామాన్య సంసారంలో పుట్టి తనతోపాటే ఎం బి. చదివాడు చదువులో తెలివితేటలు అందం తన్ని తన హృదయానికి దూసుకొనిపోయాయి అతన్ని ప్రేమించింది...అతను ప్రేమించాడు. దానికి ప్రతిఫలం...ఇదా!..."

తనకి జ్ఞప్తికి వచ్చింది—ఈ పాటికి పెళ్లి వారింట్లో హడావిడిగా ఉంటుంది. తన కోసం ఇంటి దగ్గిర అంతా ఎదురు చూస్తూ వుంటారు...తన హృదయ ఘోష తెలియక అందరిలా నేను ఆనందిస్తున్నాననుకుంటారు. తనకి కాబోయే భర్త...తను జీవితాంతం అతని కాళ్ళ దగ్గర పడివుండవలసి వచ్చే ఆయన నా కోసం పెళ్లి పందిట్లో వుంటారుగా... తన చదువు, సంస్కారం అన్నీ తండ్రి ఎర్రని చూపులలో పటాపంచలయ్యాయి. ఏమైనా తను వెళ్ళాలి... తను చచ్చి సాధించేదేముంది... త్వరగా పోవాలి...ఆలోచనలతో బరువెక్కిన తలను పట్టుకొని వెనుకకి తర్లింది...తన కట్టెనే ఆయనకు అర్పించాలి...ప్రపంచం అంతా నాగరికతలో మునిగి తేల్తున్నా, అధునాతన భావాలు బయట పెట్టినా తను కోరిన వ్యక్తిని వివాహం చేసుకోలేకపోయింది. జీవితం అంటే చెరగాటం కాదు.

తనింటికి చేరేటప్పటికి అన్నయ్య అడిగాడు. "అదేమమ్మా విజయా! ఇంత ఆలస్యం అయింది...వేళ అవుతోంది కదమ్మా తయారుకా" అన్నాడు. మంగళ వాద్యాలు-గీతాలువిని పెళ్ళి కావలసిన పిల్లలు ఏదో అనుభూతితో పులకరించి పోతున్నారు. విజయ హృదయం పాషాణం. అమ్మ-అమ్మక్కయ్యచేరి విజయని పెళ్ళికూతురుని చేశారు. మరో రెండు గంటల్లో తనకు తాళికట్టి తనదాన్నిచేసుకుంటా డాయన.

సందడి ఎక్కువైంది...పెళ్ళికూతురు విజయని పెండ్లి మండపానికి తీసికొని వెళ్ళారు. కుందనపు బొమ్మకిమల్లె వెళ్లి కూర్చుంది. ఒకదానివెనుక ఒకటి తతంగాలు పూర్తి అయ్యాయి. విజయ కళ్లంబడి నీరు ప్రవహిస్తోనే ఉంది... పెద్దల ఆశీర్వచనాలు-మంగళ వాద్యాలతో మూడు ముళ్ళు పడ్డాయి విజయ మెడకి. తన ఆశంతా నిరాశైంది. ★